# కానుక

"ప్రసూనమ్మ పుట్టినరోజుకి ఈ సుట్టుమంచి బగుమానం యివ్వాల! ఏటివ్వాల! ఏటిత్తే ఆరి ఓదాకు సరితూగుద్ది?' అనుకుంది మల్లి.

ప్రెసిడెంటు వెంకటాద్రి. సౌభాగ్యలక్ష్మిల ఏకైక సంతానం ప్రసూన. ఆమె ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతోంది.

ప్రెసిడెంటు వెంకటాద్రికి పేద, ధనిక తారతమ్యం లేదు. కులమత విచక్షణ అంతకన్నా లేదు. అందరినీ ఎంతో అభిమానంతో చూస్తాడు. ఎవరికి ఎప్పుడు ఏ సహాయం అవసరమైనా తప్పక చేస్తాడు.అతడంటే చుట్టుపక్కల గ్రామ ప్రజలకు ఎంతో గౌరవం వుంది.

తండ్రి మంచి గుణాలన్నీ ప్రసూనకు వచ్చేయి. అంతేకాదు ప్రసూన గొప్ప స్నేహశీలి! గ్రామంలో ఆమెకు స్నేహితురాండ్రు చాలామంది వున్నారు. ఆమె అందరి ఇళ్లకూ వెళ్తుంది. ఫ్రెండ్స్‌తో ముచ్చటించి వారి కష్టసుఖాలలో పాలుపంచుకుని చేతనైన సహాయం చేస్తుంది. మంచిసలహాలిస్తూ అందరి మన్ననలు పొందుతోంది.

ప్రతి సంవత్సరం కూతురు పుట్టిన రోజు పెద్ద పండుగలా జరిపిస్తున్నారు. వెంకటాద్రి, సౌభాగ్యలక్ష్మి, ప్రసూన పట్నంలో తన క్లాస్‌మేట్స్, ఫ్రెండ్స్ గ్రామంలో తన ఈడు ఆడపిల్లలు, స్నేహితురాళ్లను స్వయంగా పిలిచి బర్త్‌డేనాడు అందరికీ మంచి విందు ఇస్తోంది యేటా.

ప్రసూన చిన్ననాటి స్నేహితురాలు మల్లి. ఇద్దరూ కలిసి ఆ గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్లో ఐదవతరగతి వరకూ చదువుకున్నారు. ప్రసూనకు ఫ్రెండ్స్ అందరికంటే మల్లి అంటే అభిమానం ఎక్కువ. వారిరువురి స్నేహానికి అంతస్తులు



ఏనాడూ అడ్డురాలేదు. మల్లిని సొంత చెల్లెలులా చూస్తుంది ప్రసూన. అయితే మల్లి ఏనాడూ హద్దుమీరి ప్రవర్తించలేదు.

బర్త్‌డే పార్టీకి వచ్చే ఫ్రెండ్సంతా ఏవో కానుకలు తెచ్చి ప్రసూనకిచ్చి గ్రీటింగ్ చెప్పడం రివాజు. మల్లి ఏనాడూ స్నేహితురాలికి బర్త్‌డే కానుక ఇవ్వలేదు. ఇవ్వగల స్తోమత కూడా లేదామెకు. రోజూ స్నేహితురాలికిచ్చే సన్నజాజి పూల చెండే ఆనాడూ ఇస్తోంది. ఆ పూలు దొడ్లో పూసినవి.

అయితే గత మూడు నెలలుగా మల్లి కూడా కొద్దో గొప్పో డబ్బు సంపాదిస్తోంది. గ్రామంలో మహిళా ఉపాధి పథకం కింద డ్వాక్రాగ్రూప్ ఒకదానిని ఏర్పాటు చేసేరు. అందులో తయారైన వస్తువులు వెంట వెంటనే మార్కెట్ చేస్తున్నారు.

మల్లికూడా మహిళా ఉపాధి కేంద్రంలో చేరి పని నేర్చుకుంటూ డబ్బు

సంపాదిస్తోంది. అందుకని ఈయేడు స్నేహితురాలి పుట్టినరోజుకు ఏదైనా మంచి. కానుక ఇవ్వాలనుకుంది. అయితే ఏమివ్వాలో, ఏ వస్తువు ఆమెకు ఉపయోగంగా వుంటుందో తెలియక తికమక పడుతోంది.

ఆ తరుణంలో మల్లికి డ్వాక్రా గ్రూపులో పనిచేస్తున్న శోభన టీచరు గుర్తుకొచ్చింది. ఆమెను కలిసి విషయం చెప్పింది. శోభన టీచరుకి మల్లి అంటే ప్రత్యేకమైన అభిమానం వుంది. మల్లి చిరుకైన పిల్ల, ఏ విషయమైనా ఒకమారు చెప్తే చాలు గ్రహిస్తుందని అందరితోనూ అంటుంది శోభన. పైగా ఆమెకు మల్లి ఆర్థిక పరిస్థితి తెలుసు.

"చూడు మల్లీ! కొన్న వస్తువులు అందరూ తెచ్చి కానుకగా యిస్తారు. అదేం గొప్ప విషయం కాదు! అయితే ఏ వస్తువైనా నువ్వు నీ చేతులతో తయారుచేసింది కానుకగా యిస్తే ఇచ్చినందుకు నీకు, తీసుకున్నందుకు ఆమెకు ఎంతో తృప్తిగా వుంటుంది. పైగా కొన్నవస్తువుకంటే తయారుచేసుకున్న వస్తువు చవకగా వస్తుంది!

నీ స్నేహితురాలు కాలేజీలో చదువుతోంది అన్నావుకదూ! ఆమెరోజూ కాలేజీకి బుక్సు అవి తీసుకొని వెళ్లేందుకు ఉపయోగపడే షోల్డరు బేగుఫర్ క్లాత్‌తో తయారుచేసి యిస్తే ఎంతో బాగుంటుంది. చూసేందుకు ఎంతో అందంగా వుంటుంది! పైగా అది ఆమెకు రోజా ఉపయోగపడుతుంది. బేగు మనం బజారులో కొంటే, మూడు, నాలుగు వందలు ఖరీదు చేస్తుంది. అదే మనం తయారుచేసుకుంటే మనకు సుమారు అరవై రూపాయలలో వస్తుంది. షోల్డరు బేగుకి ఫర్ క్లాత్ ముక్కలు రేపు నేను పట్నం నుండి వస్తున్నప్పుడు తెస్తాను. వాటితో బేగు తయాంుచెయ్యడం నీకు నేర్పుతాను" అంది శోభన టీచరు.

టీచరు సలహాకు ఎంతో ఆనందించింది మల్లి. ఆవిడకు తన వద్దనున్న నలభై రూపాయలు ఇచ్చింది. మిగిలిన సొమ్ము వచ్చేనెలలో ఇస్తానని చెప్పింది.

మర్నాడు శోభన టీచరు ఫర్ క్లాత్ ముక్కలు, లైనింగ్‌క్లాత్, జిప్పులు, బటన్స్ వగైరా సామాన్లు తెచ్చింది. వాటితో ఫర్ క్లాత్ షోల్డరు బేగు మల్లితో తయారు చేయించింది.

మల్టీకలర్స్‌లో షోల్డరు బేగు చూడ్డానికి ఎంతో అందంగా వుంది. మల్లి

ఆనందానికి అంతులేదు. టీచరుకి కృతజ్ఞతలు చెప్పింది.

శోభన టీచరు బేగుని గిఫ్ట్ పేపర్లో నైస్‌గా పేక్ చేసి మల్లికిచ్చింది.

ప్రసూన బర్త్‌డేనాడు మల్లి వేకువనే తయారైంది. గిఫ్ట్ పేకెట్ తీసుకొని ప్రసూన ఇంటికి బయల్దేరి వెళ్లింది. అందరి వలె స్నేహితురాలికి తనూ ఈయేడు మంచి కానుక ఇవ్వబోతున్నందుకు మల్లికి ఎంతో సంతోషంగా వుంది.

పట్నం నుండి ప్రసూన ఫ్రెండ్స్, క్లాస్‌మేట్స్, గ్రామంలోని స్నేహితురాళ్లు అందరూ వచ్చేసారు. అందరికంటే ఆలస్యంగా వచ్చింది మల్లే.

మల్లి స్నేహితురాలిని గ్రీట్ చేసి పేకెట్ అందించింది.

"ఏమిటే ఇంత లేటుగానా రావటం!" అని ప్రసూన తన ఫ్రెండ్స్ అందరికీ మల్లిని పరిచయం చేసింది.

వచ్చిన కానుకలను సౌభాగ్యలక్ష్మి జాగ్రత్తగా విప్పి వాటిని కూతురుగదిలో పెడుతుంది ప్రతియేడు.

ఈమారుకూడా ఆవిడ అదే చేసింది.

మర్నాడుదయం ప్రసూన కాలేజీకి బయల్దేరుతూ గదిలో ఎదురుగా ఉన్న ఫర్ క్లాత్ షోల్డరు బేగు తీసి అందులో బుక్సు పెట్టుకొని బయటకు వచ్చింది.

ఆరోజు తండ్రికి బదులు అప్పలసూరి రిక్షా తీసుకొని వచ్చాడు. అప్పుడప్పుడు దాలయ్యకు బదులు అతని కొడుకు రిక్షా తేవడం పరిపాటే.

"సెవులపిల్లి ఎంత్రికల్లా అవుపడతందేటమ్మాయి గోరూ తవరి సంచీ?" అన్నాడు అప్పలసూరి ప్రసూన షోల్డరు బేగు చూసి ఎంతో ఆశ్చర్యంగా.

"దీన్ని ఫర్ క్లాత్ అంటారు! దీంతో కుక్కపిల్ల, పిల్లి, కోతి వంటి బొమ్మలు చేస్తారు" అంది ప్రసూన రిక్షాలో కూర్చుంటూ.

"కానండి సంచి సూపరుగుందండి! శానాబాగుంది!"

"అవునా! నీకు అంతగా నచ్చిందా! అయితే యింద తీసుకో!" అని సంచిలో పుస్తకాలు బయటకు తీసి సంచి అప్పలసూరి కందించింది ప్రసూన.

వాడు సంచీ తీసుకునేందుకు జంకేడు.

"ఫర్వాలేదు నేను నీకు దీన్ని కానుకగా యిస్తున్నా తీసుకో!" అని బలవంతంగా యిచ్చింది.

అప్పలసూరి ఆనందానికి అంతేలేదు. దానిని తన మరదలు మల్లికి కానుకగా యిస్తే 'ఎర్రిబాగుల్ది ఎంత సంబరపడిపోతాదో?' అనుకున్నాడు.

ఆ సాయంత్రం అప్పలసూరి పరుగుపరుగున మల్లివద్దకు వెళ్లి- "మల్లీ నీకోసం ఏటి దెచ్చినానో సూడు!" అంటూ సంచీ మల్లికివ్వబోయేడు.

బావచేతిలో సంచీ చూసి మల్లి "కెవ్వ్"మంది.

**('ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక', ఆగస్టు 2001)** ✪